క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 18, బెండ 50, పచ్చి మిర్చి 40, కాకర 38, బీర 45, క్యాబేజి 10, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 13, దొండ 35–45, చిక్కుడు 35, గోకర 45, బీట్‌రూట్ 15, క్యాప్సికం 45, ఆలు 15, దోస 35, సొర 15, పొట్ల 15, ఉల్లి 14, చామగడ్డ రూ. 65 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే దేవిరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న కాలనీ ప్రతినిధులు

చంపాపేట: చంపాపేట డివిజన్ మాధవనగర్ కాలనీలో గుంతలుగా మారిన కాలనీ అంతర్గత రహదారులు, దశాబ్దాల క్రితం భూగర్భ డ్రైనేజీతో మురుగు పరుగు సమస్యలను పరిష్కరించాలని శనివారం కాలనీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు అనసూయ ఆధ్వర్యంలో ఎల్‌బి నగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలసి వినతి పత్రం అందచేశారు. కాలనీ సమస్యలకు త్వరలో శాశ్వత పరిష్కారం కల్పించనున్నట్లు సుధీర్‌రెడ్డి తమకు హామీ ఇచ్చినట్లు ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘ ప్రతినిధులు బెనర్జీ, వెంకటమ్మ, సత్తయ్య, యాదయ్య, శ్రీకాంత్, డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ బీసీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్‌డ్రెయిన్ నిర్మాణంలో పైపులా?

- సాంకేతికత సాకుతో ఇష్టారాజ్యంగా పనులు
- రూ. 10 కోట్ల పనుల్లో అవకతవకలు!
- విజిలెన్స్ విచారణకు కార్పొరేటర్ శ్వేత డిమాండ్

సైదాబాద్: సరూర్‌నగర్ చెరువు పరిసర ప్రాంతాల్లో వరద ముంపు శాశ్వత పరిష్కారం కోసం నిర్మిస్తున్న బాక్స్‌డ్రెయిన్ నిర్మాణ పనుల్లో భారీగా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులను ఇష్టారాజ్యంగా చేస్తున్నారని, వారికి ఎస్‌ఎన్‌డీపీ అధికారులు సహకరిస్తున్నారంటూ స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఎస్‌ఎన్‌డీపీ అధికారులు సాంకేతికతను సాకుగా చూపించి బాక్స్ డ్రెయిన్ పనులు సవ్యంగా నిర్వహించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. నిర్మాణం ఇలానే పూర్తి చేస్తే వరద ముంపునకు పరిష్కారం లభించకపోగా సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ. 10 కోట్ల వ్యయంతో ఎస్‌ఎన్‌డీపీ అధికారులు నిర్మిస్తున్న ఈ బాక్స్ డ్రెయిన్ పనులపై విజిలెన్స్ విచారణ జరిపితే వాస్తవాలు బయటకు వస్తాయని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ డిమాండ్ చేస్తున్నారు.



గోల్డెజీహోం ఎదురుగా నిర్మాణంలో పైప్‌లైన్‌లు వాడిన దృశ్యం (ఫైల్)

ముంపు సమస్యకు పరిష్కారంగా...

సరూర్‌నగర్ చెరువు పరిసర ప్రాంతాలైన ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పదిహేను కాలనీలు, బస్తీలవాసులు నాలుగేళ్లుగా వర్షాకాలంలో వరద ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడితే సహాయక చర్యల కోసం ఇక్కడ పడవలు వినియోగించారంటేనే ఇక్కడి పరిస్థితి తీవ్రత ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. స్థానికులు, ప్రజాప్రతినిధుల వినతులతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఇక్కడ బాక్స్‌డ్రెయిన్ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. రూ. 10 కోట్ల నిధులతో ఎస్‌ఎన్‌డీపీ అధికారులు నిర్మించనున్న బాక్స్‌డ్రెయిన్‌కు 2022 జనవరి 28న మలక్‌పేట ఎమ్మెల్యే పాషాఖాద్రీ, కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. బాక్స్ డ్రెయిన్ నిర్మాణంతో తమ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

బాక్స్‌డ్రెయిన్ నిర్మించాల్సింది ఇలా...

సరూర్‌నగర్ చెరువును ఆనుకొని ఉన్న సింగరేణి ఆఫీసర్స్ కాలనీ రోడ్ నెం: 6 నుంచి బతుకమ్మ ఘాట్, శంకేశ్వరబజార్ కాలనీ మీదుగా శంకేశ్వరబజార్ చౌరస్తాలో ఉన్న మసీదు వెనుక ఉన్న ఓపెన్ నాలా వరకు బాక్స్‌డ్రెయిన్ నిర్మించాలనేది అధికారుల ప్రణాళిక. బాక్స్‌డ్రెయిన్‌ను రెండున్నర మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతుతో పూర్తి ఆర్‌సీసీతో 1210 మీటర్ల వరకు నిర్మించాల్సి ఉంటుంది. వర్షం కురిసినప్పుడు ప్రతి వాన చుక్కా డ్రైనేజీలోకి వెళ్లేలా నిర్మాణంలో చర్యలు తీసుకోవాలి.

నిర్మిస్తుంది ఇలా...

1210 మీటర్ల పొడవుతో బాక్స్‌డ్రెయిన్‌ను పూర్తి ఆర్‌సీసీతో నిర్మిస్తే ఎంతటి భారీవర్షాలు కురిసినా వరద నీరు సాఫీగా డ్రెయిన్ నుంచి వెళ్లాయి. అయితే బాక్స్‌డ్రెయిన్ నిర్మాణంలో చాలా చోట్ల సాధారణ పైప్‌లైన్‌లు వాడటమే స్థానికులను ఆందోళనకు గురిచేస్తుంది. సరూర్‌నగర్ చెరువుకు సింగరేణి ఆఫీసర్స్ కాలనీ, శంకేశ్వరబజార్‌లకు మధ్య ఉన్న రహదారిలో బాక్స్‌డ్రెయిన్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో కొంత మేర పూర్తి ఆర్‌సీసీతో నిర్మించి చాలా భాగం పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసారు. నిర్మాణ సమయంలో ఇలా పైప్‌లైన్‌లు ఎందుకు వాడుతున్నారని స్థానికులు అడిగితే అధికారులు సాంకేతికతను సాకుగా చూపించారు. చెరువుకు, ఇళ్లకు మధ్య ఉన్న ప్రాంతం మొత్తం ఒకే పరిస్థితుల్లో ఉన్నా ఒకచోట ఆర్‌సీసీతో, మరోచోట పైప్‌లైన్‌లతో నిర్మించారు.

భారీ ప్రవాహాన్ని పైప్‌లైన్‌లు తట్టుకుంటాయా?

భారీ వర్షాలు కురిస్తే ఎగువ ప్రాంతాల నుంచి ఉధృతంగా వచ్చే వరదనీటి ప్రవాహాన్ని పైప్‌లైన్‌లు తట్టుకుంటాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పూర్తి ఆర్‌సీసీతో నిర్మించిన చోట దృఢంగా ఉండి పైప్‌లైన్‌లు ఉన్నచోట భారీ ప్రవాహాన్ని తట్టుకోలేక పగిలిపోతే ముంపు సమస్య మరింత అధికంగా మారుతుందని వారు భయాందోళనలు చెందుతున్నారు. బాక్స్‌డ్రెయిన్ పనులు ముగింపు దశకు చేరుకుంటున్న సమయంలో నిర్మాణంలో లోటుపాట్లను గుర్తించి సవరిస్తేనే ఈ ప్రాంతంలో భవిష్యత్‌లో వరద ముంపు నుంచి విముక్తి కలుగుతుందని వారు ఆశిస్తున్నారు.

విజిలెన్స్ విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి...



సరూర్‌నగర్ చెరువుకు ఆనుకొని నిర్మిస్తున్న బాక్స్‌డ్రెయిన్ పనులపై విజిలెన్స్ విభాగం తప్పనిసరిగా విచారణ చేయాలి. నిర్మాణ సమయం నుంచే స్థానికులు పలు మార్లు అవకతవక పనులను మా దృష్టికి తీసుకొచ్చారు. వాటి గురించి ఎన్నిసార్లు ఎస్‌ఎన్‌డీపీ అధికారులను ప్రశ్నించినా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాల్సిన అధికారులు డ్రెయిన్ నిర్మాణంలో పైప్‌లైన్‌లు వాడటం పలు అనుమానాలకు తావిస్తోంది. విజిలెన్స్ విచారణ చేసి వాస్తవాలు బయటకు తీసి డ్రెయిన్ నిర్మాణంలో అవకతవకలు సరి చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– జంగం శ్వేతమధుకర్‌రెడ్డి, ఐఎస్‌సదన్ కార్పొరేటర్

వ్యాయామంతో పరిపూర్ణ ఆరోగ్యం

వనస్థలిపురం: యాంత్రిక జీవన విధానంలో ప్రజలకు వ్యాయామం ఎంతో అవసరమని, వ్యాయామంతోనే పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం వనస్థలిపురం పనామా రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వీ9 ఫిట్నెస్ స్టేషన్‌ను కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కూర్మెళ్ల వేములయ్యగౌడ్‌లతో కలసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, నిర్వాహకులు పోలేపల్లి వెంకటేష్, నాయకులు చింతల రవికుమార్, లగ్గోని శ్రీధర్‌గౌడ్, సంజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణానికి కారణమైన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

మలక్‌పేట: ఇంటర్ విద్యార్థుల మరణానికి కారణమైన కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి సమితి రాష్ట్ర అధ్యక్షుడు మంద రమేష్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మూసారంబాగ్ చౌరస్తాలో ఆయన ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్పొరేటర్ విద్యాసంస్థలు కేవలం ర్యాంకుల కోసం విద్యార్థులను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. బట్టీ చదువులతో విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారన్నారు. గడిచిన పది రోజుల్లోనే ఒకే విద్యాసంస్థకు చెందిన ఇద్దరు ఇంటర్ విద్యార్థులు మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకుని జీవితాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కార్పొరేట్ విద్యాసంస్థలు అనుసరిస్తున్న విధానాలే చావుకు కారణమన్నారు. విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఐక్యకార్యచరణ కమిటీతో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు వడ్డెపల్లి రాకేష్, అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు చిప్పలపల్లి వెంకట్, జి.మహేష్, టీవీఎస్ గ్రేటర్ అధ్యక్షుడు పవన్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు సిహెచ్ రమేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఇ.మహేష్ పాల్గొన్నారు.

సాయిరాంకు అవార్డు

లింగోజిగూడ: ముంబయిలో జరిగిన గ్లోబల్ ఫేమ్ అవార్డ్స్ 2023లో హయత్‌నగర్ వినాయక్‌నగర్‌కు చెందిన పాట్లపల్లి సాయిరాం గౌడ్‌కు సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు దక్కింది. అవార్డును ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ చేతుల మీదుగా సాయిరాంగౌడ్ అందుకున్నారు. నగరానికి వచ్చిన సాయిరాంగౌడ్‌ను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

జోడో యాత్ర మలక్‌పేట ఇన్‌చార్జ్‌గా బాలకృష్ణ యాదవ్

చాదర్‌ఘాట్: కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో యాత్ర మలక్‌పేట ఇన్‌చార్జ్‌గా జి.బాలకృష్ణ యాదవ్ నియమితులయ్యారని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, సెట్విన్ మాజీ చైర్మన్ మక్సూద్ అహ్మద్ తెలిపారు. శనివారం ఓల్డ్‌మలక్‌పేటలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఈ నెల 11న బీ బ్లాక్ క్వార్టర్స్‌లో, 12న సైదాబాద్ డివిజన్‌లో యాత్ర నిర్వహిస్తామన్నారు. నేతలు చౌకి రవికుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, బాబు శ్రీనివాస్, షకీల్, కిషన్‌సింగ్, మదన్‌బాబు, మహేష్, హకీం, లింగాల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

59-జీవో సమస్యలు పరిష్కరించండి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినతి

ఎల్‌బీనగర్: 59-జీవో సమస్యలు పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్‌ను శనివారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... 59జీవో కారణంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్, నాగోలు, చంపాపేట, హయత్‌నగర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. వంద గజాలకు రూ. లక్ష నుంచి రూ. 4 లక్షలు రావాల్సి ఉండగా పలు బస్తీలలో రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు వస్తుందని తెలిపారు. బంజాల కాలనీ, గుంటి జంగయ్య నగర్ బస్తీలలో పక్కపక్కన ఉన్న నాలుగు ఇండ్లలో 59జీవోలో మొదటి ఇంటికి రూ. 15 లక్షలు, రెండో ఇంటికి రూ. 10 లక్షలు, మూడో ఇంటికి రూ. 5 లక్షలు, నాలుగో ఇంటికి రూ. 3 లక్షలు వచ్చిందని తెలిపారు. ఒకే వరుసలో ఉన్న ఇండ్లకు ఇంత వ్యత్యాసంతో బిల్లులు రావడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని వివరించారు. వాటికి సంబంధించిన పత్రాలను కలెక్టర్‌కు ఇవ్వడంతో పాటు పూర్తి వివరాలను ఎమ్మెల్యే కలెక్టర్‌కు అందజేశారు. 59జీవో బిల్లులపై పూర్తి స్థాయి విచారణ జరిపి న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నూతన హెల్త్ స్కీమ్‌పై విధివిధానాల ఖరారు

పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

మలక్‌పేట: ఉపాధ్యాయులకు ఏప్రిల్ ఒకటి నుంచి నూతన హెల్త్ స్కీమ్ వర్తింపజేసేలా విధివిధానాలు ఖరారు చేస్తారని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. హైద్రాబాద్, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సైదాబాద్ మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను కలిశారు. పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ ప్రకారం తప్పకుండా జరుగుతాయని, సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వాన్ని ఒప్పిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ ఎల్లవేళలా ముందుంటుందన్నారు. ప్రచారంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మన్నెం జ్యోతి, అశోక్, ప్రశాంత్‌రెడ్డి, నరసరాజు, వెంకట్‌రెడ్డి, సురేష్‌కుమార్, రాజు, వీరారెడ్డి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైదాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న కుక్కల దాడుల నేపథ్యంలో ప్రజలు, విద్యార్థులు రహదారులపై వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. శనివారం శంకేశ్వరబజార్ ప్రభుత్వ పాఠశాలలో ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులు, వెటర్నరీ అధికారులతో కలిసి విద్యార్థులకు వీధికుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుక్కలను భయపెట్టినా, అవి దగ్గరగా ఉన్నప్పుడు వేగంగా నడిచినా అవి దాడి చేస్తాయన్నారు. అనంతరం కార్పొరేటర్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి కుక్కల బెడద నుంచి తప్పించుకునే సూచనలు ముద్రించిన కరపత్రాలను పంచారు. మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్, వెటర్నరీ అధికారి అశోక్, డాక్టర్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రేణుక పాల్గొన్నారు.

దృష్టి మరల్చి కారులోని నగలు.. నగదు చోరీ

చైతన్యపురి: కారు దగ్గర నోట్లు పడిపోయాయని డ్రైవర్ దృష్టి మరల్చిన ఓ అగంతకుడు కారు సీటులోని బంగారు ఆభరణాలు, డబ్బు ఉన్న బ్యాగ్‌ను చోరీ చేసిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బోడుప్పల్ పీర్జాదిగూడకు చెందిన స్పందన, ప్రమోద్‌లు డాక్టర్లు. శనివారం సాయంత్రం కొత్తపేట గ్రీన్ హిల్స్ కాలనీలోని ఫస్ట్ క్రై షాపింగ్ మాల్‌కు కారు (టీఎస్24 జీ2222)లో వచ్చారు. డ్రైవర్ కారులో ఉండగా వారు మాల్‌లోకి వెళ్లారు. అదే సమయంలో కారు దగ్గరకు వచ్చిన ఓ అగంతకుడు తన వద్ద ఉన్న రూ. 20, రూ. 10 నోట్లను కింద వేశాడు. డ్రైవర్ శ్రీనివాస్ దగ్గరకు వచ్చిన ఆ అగంతకుడు నోట్లు కింద పడిపోయాయని సమాచారం ఇచ్చాడు. కారు దిగిన శ్రీనివాస్ నోట్లను ఏరటం ప్రారంభించాడు. అదే అదునుగా కారులో ఉన్న లేడీస్ హాండ్ బ్యాగ్‌ను తీసుకుని పరారయ్యాడు. దంపతులు వచ్చి చూడగా బ్యాగ్ కనిపించలేదు. డాక్టర్ సునంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగులో 12 తులాల బంగారు ఆభరణాలు, రూ. 20 వేలు పోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు సమీపంలోని సీసీ ఫుటేజీను పరిశీలించారు. అగంతకుడు నల్ల డ్రస్ వేసుకున్నాడని.. సుమారు నలభై సంవత్సరాలు ఉంటాయని గుర్తించారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. శనివారం అధికారులతో కలిసి భీమానగర్‌కాలనీలో కార్పొరేటర్ పర్యటించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో జోనల్ కమిషనర్ పంకజ ఫోన్ ద్వారా స్థల యజమానులతో మాట్లాడి భీమానగర్ నుంచి హుడా భారతికాలనీ వరకు ఎస్‌ఎన్‌డీపీ పనులు చేసేందుకు స్థల సేకరణ కోసం మాట్లాడారని సుజాతనాయక్ వెల్లడించారు. వరదతో ఇబ్బందులు పడుతున్న ఆయా కాలనీలో ప్రజలకు సిటీ ప్లానర్ ప్రసాద్, ఎస్‌ఎన్‌డీపీ ఈఈ కృష్ణయ్య, డీఈ ప్రసాద్, స్థలయజమానులు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రమచంద్రారెడ్డితో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, హుడాభారతి కాలనీ అధ్యక్షుడు మనలప్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ ఎంతో కీలకం

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



సరస్వతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, డైరెక్టర్ ఇందిర

మలక్‌పేట: జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదివి లక్ష్య సాధన కోసం కృషి చేయాలని, బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్లో శనివారం పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఫేర్‌వెల్ డేకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... పోటీ యుగంలో కొత్త విషయాలు తెలుసుకోవడానికి మేధస్సుకు పదును పెట్టాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా తీర్చిదిద్దడానికి బ్రిలియంట్ విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. స్కూల్ డైరెక్టర్ ఇందిర, ప్రిన్సిపాల్ మధుర వేణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాధ, కీర్తి పాల్గొన్నారు.

పేదల ఉత్పత్తులను ప్రోత్సహించాలి



చైతన్యపురి: పేదరికం పోవాలంటే పేదలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించాలని విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్ రావు, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్ అన్నారు. చేనేతను వాడండి నేతన్నను కాపాడంటి అంటూ విశ్వమానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొత్తపేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చేనేత వస్త్రకళ, చేనేత హస్తకళకు ప్రఖ్యాత గాంచిన దేశం మనది అన్నారు. ప్రభుత్వం సహకరిస్తున్నా చేనేత కార్మికులకు రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది చేనేత వృత్తిమీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని, విదేశీ వస్తువులను బహిష్కరించి స్వదేశీ వస్తువుల ను ప్రోత్సహించటం ద్వారా వారికి జీవనోపాధి కల్పించిన వారమవుతామన్నారు. ర్యాలీలో పీవీటీ సంఘ సభ్యులు, వ్యాపారులు, చేనేత కార్మికుల కుటుంబాలు పాల్గొన్నారు.



వైభవంగా మహాసుదర్శన సహిత ధన్వంతరి హోమం

పూజలలో పాల్గొన్న నంద్యాల ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయం పుష్కర బ్రహ్మోత్సవాలలో మూడవ రోజు శనివారం మహాసుదర్శన సహిత ధన్వంతరి హోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ముఖ్యఅతిథిగా నంద్యాల శాసన సభ్యుడు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, ఆలయ వ్యవస్థాక చైర్మన్, చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ వంగా చంద్రారెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగద్గురువు హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతి మహాసంస్థాన పరిపాలిత వారి అనుగ్రహంతో బ్రహ్మశ్రీ కొడకొండ్ల శ్రీరామశరన్ శర్మ గురూజీ హిందూ ధర్మం జ్యోతిష్యులు చాముండేశ్వరి గురు దత్తపీఠం వ్యవస్థాపకులు, మైసూర్ దత్తపీఠం ఆస్థాన విద్వాంసులు ఆచార్య బ్రహ్మత్వంలో శ్రీరమణగురు స్వామి, రాజేశ్‌పాండే పర్యవేక్షణలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు సద్ది సందీప్‌రెడ్డి, లంకల రమేశ్ రెడ్డి, మిరియాల అంజయ్య గుప్తా, లింగాల దశరథగౌడ్, సుంకరి రమేశ్‌గౌడ్, విఘ్నేశ్వరరెడ్డి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కేశవరెడ్డి, సూర్యప్రకాశ్ గుప్తా, భిక్షపతిగౌడ్, వంగ ప్రవీణ్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి, శివరాం రెడ్డి, హరీష్‌రెడ్డి ముత్యాల వీరారెడ్డి, హరికృష్ణ, నిర్మలేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి దంపతులు

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం: ఇద్దరి అరెస్ట్

- 35 మందిని మోసగించిన నిందితులు
- రూ. 60 లక్షలు వరకు దండుకున్న వైనం

మలక్‌పేట: శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగ యువతను నమ్మించి లక్షల్లో డబ్బులు దండుకుని మోసం చేసిన ఇద్దరిని మలక్‌పేట పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కనపరాజు శ్రీనివాస్ సమాచారం మేరకు... ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం మరుపూర్ గ్రామానికి చెందిన అవ్వూర్ మోహన్(33) దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారంలో 2021 జూన్ మాసంలో 'ఎంఎస్ ఐటీ టెక్నాలజీస్' పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం ఒడ్డువెట్టి స్ట్రీట్‌కు చెందిన మాలే మహేష్(31) ఓల్డ్ మలక్‌పేట అగ్రికల్చర్ ఆఫీస్ సమీపంలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. అతని సంస్థలో మేనేజర్ నియమించుకున్నాడు. ఇద్దరు సంస్థ నిర్వహిస్తున్నారు. సంస్థలో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మబలికారు. నిరుద్యోగ యువకులు కొంతమంది శిక్షణ కోసం సంస్థలో చేరగా ఒకరిద్దరికి స్థానిక కంపెనీల్లో ఉద్యోగం ఇప్పించాడు. రూ. 50 వేలు నుంచి రూ. 2.50 లక్షల వరకు అందిన కాడికి దాదాపు 35 మంది నుంచి రూ. 60 లక్షల వరకు డబ్బులు దండుకున్నాడు. బంజారాహిల్స్ రోడ్-10లో నివాసం ఉండే అబ్దుల్ హనీఫ్ 2017లో గ్రాడుయేట్ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం వెతుకుతూ 2022 అక్టోబర్‌లో సోషల్ మీడియా ద్వారా మాలే మహేష్‌ను సంప్రదించాడు. అనంతరం గడ్డిఅన్నారంలోని ఐడియల్ డిగ్రీ కాలేజ్ సమీపంలో ఉన్న 'ఎంఎస్ ఐటీ టెక్నాజీస్' చేరుకుని వారిద్దని కలిశాడు. సంస్థలో శిక్షణకు సంబంధించిన వివరాలు అతనికి చెప్పి రూ. 2.5 లక్షలు చెల్లించమని అడిగారు. 2022 అక్టోబర్ 10వ తేదీన లక్ష రూపాయలు చెల్లించాడు. 17న ఆన్‌లైన్‌లో రూ. 1.5 లక్షలు కట్టాడు. మాదాపూర్‌లో ఉన్న 'స్పైడర్‌టిక్ ఇట్ సొల్యూషన్' పేరుతో ఆఫర్ లెటర్ ఇచ్చి ప్రాసెస్ జాబ్‌లపై శిక్షణ ఇచ్చారు. తరువాత 'ఇన్నోబ్రైట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్' అనే వేరే కంపెనీ నుంచి ఐడీ కార్డులు అందించాడు. అనుమానం వచ్చి అతడు వారు ఇచ్చిన లోకేషన్‌కు వెళ్లగా అక్కడ ఆఫీస్ లేదు. ఆఫర్ లెటర్, ఐడీ కార్డులు నకిలీవని తెలిసి మోసపోయానని గ్రహించాడు. బ్లాంక్ చెక్కులు పెట్టుకుని ఇచ్చిన ల్యాప్‌టాప్ పాతది కావడంతో సరిగా పని చేయలేదు. గడ్డిఅన్నారంలోని ఆఫీస్ మూసేసి అక్కడి నుంచి వారు ఉడాయించారు. దీంతో అతడు 2023 ఫిబ్రవరి 7 తేదీన మలక్‌పేట పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాదాపు 35 మందిని మోసగించినట్లు విచారణలో తేలిందని, ఇద్దరిని అదుపులోకి తీసుకుని కోర్టు ఎదుట హాజరు పరిచినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.